క్లుప్తంగా

ముస్లింలకు ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాయవరం: మండలంలోని వెదురుపాక మసీదులో ముస్లిం సోదరులకు బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదు నిర్వాహకుడు షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. తొలుతగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అహ్మద్ అబూబ్, షేక్ మదీనా బాషా, మహబూబ్ బాషా, ఖాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామచంద్రపురం: స్థానిక చైతన్య స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కె.రాము మాట్లాడుతూ యుకేజీ నుంచి ఫస్ట్ క్లాస్‌కు వస్తున్న విద్యార్థులకు, ఐదో తరగతి పూర్తి చేసుకుని ఆరో తరగతికి వస్తున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఈ గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు పై తరగతులపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. యుకేజీ, ఐదో తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్స్, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ చైతన్య మండపేట రీజినల్ ఇంచార్జ్ ఎం.లక్ష్మీనరేష్ మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లైబ్రరీకి పుస్తకాల అందజేత


పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ సతీష్‌రావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు చాగంటి కోటేశ్వరరావు వినదగునెవ్వరు చెప్పిన శీర్షికతో అందించిన ప్రవచనాల ఆధారంగా ముద్రించిన పుస్తకాలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల లైబ్రరీలకు సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు బుధవారం పాఠశాలలకు అందజేశారు. నైతిక విలువలు కొరవడుతున్న ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ, ప్రతి విద్యార్థికి వారిలో నైతికత పెంపొందించడానికి ఈ పుస్తకాలు ఎంతగానో దోహదం చేస్తాయని సర్పంచ్ సతీష్‌రావు తెలిపారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

'దొమ్మేటి' ఆశయ సాధనకు కృషి చేయాలి


దొమ్మేటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

మండపేట: శెట్టిబలిజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పట్టణ శెట్టిబలిజ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం కోరారు. దొమ్మేటి వెంకటరెడ్డి వర్ధంతిని బుధవారం పట్టణంలో నిర్వహించారు. శెట్టిబలిజ సంఘ కల్యాణ మండప అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి వెంకటరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మట్టపర్తి గోవిందరాజు, పిల్లి శ్రీనివాస్, నామాల చంద్రరావు, సూరంపూడి గనిరాజు, మేడిశెట్టి సాయిబాబా, నురుకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం

- శారీరక శ్రమకు దూరమవుతున్న బాల్యం
- సెల్, కంప్యూటర్ గేమ్స్‌పై ఆసక్తి
- 30 ఏళ్లకే అనారోగ్యాలతో అవస్థలు


సెల్‌ఫోన్ ఆటల్లో నిమగ్నమైన చిన్నారులు

రామచంద్రపురం రూరల్: ఒకప్పటి బాల్యం అంటే ఆటలు, పాటలు కానీ నేడు సెల్‌ఫోన్‌లు, టీవీలు, కంప్యూటర్లు. ఒకప్పుడు వీధుల్లో ఆడుకునే బాలలు కనిపిస్తుండేవారు. కానీ నేడు పాఠశాల అయిన తరువాత పిల్లలంతా టీవీలకు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఇప్పటికే ఒంటిపూట బడులు ప్రారంభం కావడంతో మధ్యాహ్నం 12.30 గంటలకే పిల్లలు పాఠశాలల నుంచి ఇళ్లకు వచ్చేస్తున్నారు. ఇక అప్పటి నుంచి ఫోన్‌లు, టీవీలతోనే వారికి కాలక్షేపం సరిపోతోంది. దీనితో శారీరక శ్రమ లేకపోవడంతో 30 ఏళ్లకే అనారోగ్యాలతో అవస్థలు పడుతున్నారు. పాఠశాల స్థాయిలో ఎక్కువ సమయం పుస్తకాలతోనే కుస్తీ పట్టకుండా కొంత సమయం ఆటలకు కేటాయిస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు బాల్యపు తీపి అనుభవాలకు దూరంగా టీవీలో కార్టూన్ షోలు, సెల్, కంప్యూటర్‌లతో ఆటలు మంచిది కాదని చెబుతున్నారు. చక్కగా ఆటలు ఆడుకునే విద్యార్థులు చదువులోనూ ముందంజలో ఉంటారని, గెలుపు ఓటములను తట్టుకునే సామర్థ్యం అలవడుతుందని సర్వేలు చెబుతున్నాయి.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలలో సుమారు 50 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో క్రీడా స్థలాలు లేకపోయినా ఉన్న కొద్దిపాటి స్థలాన్ని అయినా ఉపయోగించుకుని క్రీడల్లో పాల్గొనాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. విద్యార్థి దశలో ఆటలు సరదాను నింపడంతో పాటు భావోద్వేగాలు నియంత్రణలో తోడ్పతాయి. శారీరక, మానసిక ఆరోగ్యానికి బాటలు వేస్తాయి. ఒక్కో ఆట ఒక్కో రకంగా విద్యార్థులకు మేలు చేస్తాయి. ఆటల్లో జట్టుగా ఏర్పడటం ద్వారా సామాజిక బంధాలు మెరుగుపడతాయి. గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం అలవడుతుంది. కార్పొరేట్ విద్యతో ఒత్తిడికి లోనయ్యి ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల వార్తలను తరచుగా వార్తా పత్రికల్లో చూస్తున్నాం. ఆటలు విద్యార్థుల ఒత్తిడిని దూరం చేస్తాయి.

ఆత్మస్థైర్యం పెరుగుతుంది



మైదానాల్లో పరుగులు తీయడం, అవుట్ డోర్ గేమ్స్ ఆడటం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యం, ఆత్మస్థైర్యం పెరుగుతాయి. టీమ్‌లుగా ఆటలు ఆడటం వలన నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. సమస్యలపై ఎదురు నిలిచి పోరాడే తత్వం అలవడుతుంది. రోజూ కొంత సమయం మైదానాల్లో ఆటలకు కేటాయించాలి. పోలీసు విభాగానికి వచ్చే విద్యార్థులకు పరుగు పందెం ప్రయోజనకరంగా ఉంటుంది.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

ఆటలతో మెదడు చురుకుదనం



చదువుతో పాటు ఖాళీ సమయాల్లో శారీరక దృఢత్వం పొందే విధంగా విద్యార్థులను ఆటలవైపు ప్రోత్సహించాలి. ఆటలు ఆడే విద్యార్థుల మెదడు చురుగ్గా పనిచేసి చదువులోనూ ముందంజలో ఉంటారు. ఆరు బయట ఆటల వల్ల శారీరక దృఢత్వం మెరుగవుతుంది. చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమేనని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలి.

– ఎస్.ప్రశాంతి, డివిజనల్ మెడికల్ ఆఫీసర్, రామచంద్రపురం

రైతు సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

కాజులూరు: రైతు సమస్యలపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం శివారు చీకట్లవారిపేటలో మాతృవియోగంతో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గుత్తుల వెంకటరమణ, గుత్తుల గోపి కుటుంబ సభ్యులను బుధవారం సూర్యప్రకాశ్ పరామర్శించారు. గుత్తుల వెంకటరమణ, గోపిల మాతృమూర్తి గుత్తుల నాగమణి (60) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు తదితర నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామాల్లో కార్యకర్తలను కలుసుకుని స్థానిక సమస్యలపై చర్చించారు. పలువురు రైతులు గ్రామంలో తలెత్తిన సాగునీటి ఇబ్బందులను సూర్యప్రకాశ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతుల సమస్యలపై నాయకులకు అవగాహన లేదన్నారు. నియోజకవర్గ గ్రామాల్లో వరి పొలాలు తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లో ఉండటంతో నీటి ఎద్దడి ఎక్కువగా ఉందన్నారు. నాయకులు అధికారులతో చర్చించి శివారు భూములకు నీటి విడుదల పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, స్థానిక నాయకులు దంగేటి వెంకన్న, పాలిక వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు 17 వినతులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మండపేట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో 17 వినతులు అందాయని మున్సిపల్ కమిషనర్ రంగారావు తెలిపారు. ఇక నుంచి ప్రతి బుధవారం ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్వయంగా ప్రజల వినతులను స్వీకరించారు. పట్టణంలోని పలు వార్డుల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రతి బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నామని చెప్పారు. నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఆయా అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సత్యనారాయణ, తహసీల్దార్ తేజేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఏడీఈ శ్రీధర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రాంబాబు



కపిలేశ్వరపురం: కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన గంగుమళ్ల రాంబాబు ఎన్నికయ్యారు. ఈ నెల 25న న్యూ ఢిల్లీలో నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్టు రాంబాబు బుధవారం తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పని చేస్తున్న రాంబాబు జాతీయ కార్యకవర్గ సభ్యుడిగా ఎన్నిక కావడం పట్ల అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాంబాబుకు పలువురు అభినందనలు తెలిపారు. ప్రజారోగ్యం పరిరక్షణ, ప్రాథమిక వైద్య సేవలను మెరుగుపర్చడం, ఆధునిక వైద్య పద్ధతులపై పీఎంపీలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడమే లక్ష్యంగా కృషి చేస్తానని రాంబాబు తెలిపారు.

జేఏసీ నాయకులకు కృతజ్ఞతలు

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బకాయిల విడుదలకు విశేష కృషి చేసిన ఉద్యోగుల జేఏసీ నాయకులకు ఏపీఎన్‌జీఓస్ మండపేట యూనిట్ అధ్యక్షుడు జిత్తుక మల్లికార్జునుడు, ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, సరండర్ లీవ్‌లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లకు సంబంధించిన బకాయిల్లో కొంత భాగాన్ని ప్రభుత్వం విడుదల చేసేలా జేఏసీ రాష్ట్ర నాయకత్వం కృషి చేసిందన్నారు. ప్రభుత్వం త్వరితగతిన పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ధ్వంసం

మండపేట: ఖరీఫ్, రబీ సీజన్లలో రహదారులపై దమ్ము ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరగడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు (నాగబాబు) అన్నారు. సీసీ, బీటీ రోడ్లు దెబ్బతినడానికి ప్రధాన కారణం దమ్ము ట్రాక్టర్లే అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.కోట్లతో నిర్మించిన ఆర్అండ్‌బీ సీసీ, బీటీ రోడ్లపై ఇష్టానుసారం దమ్ము ట్రాక్టర్లు తిరగడం వల్ల తక్కువ కాలంలోనే ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ, రెవెన్యూ, అగ్రికల్చర్, రవాణా, పోలీసు, పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు.

గణిత శాస్త్ర అభివృద్ధికి పరిశోధనలు ప్రధానం


కేవీవీని సత్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

రామచంద్రపురం: గణిత శాస్త్ర అభివృద్ధికి గణిత పరిశోధనలు ప్రధానమని గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక గణిత శాస్త్ర గ్రంథాలయంకు ఫీల్డ్ టూర్ గా కాకినాడ పీఆర్ కాలేజీ డిగ్రీ విద్యార్థులు 110 మంది, మేథమెటిక్స్ అధ్యాపకులు ఆరుగురు ఈ రోజు సందర్శించారు. గణిత కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ కేవీవీ మాట్లాడుతూ విద్యార్థులు గణితశాస్త్రాన్ని ప్రాథమిక స్థాయి నుంచి పరిశోధనలు చేయాలని ఎప్పుడో యూనివర్సిటీకి వెళ్లి పరిశోధనలు చేస్తామనే రోజులు కావని ఎన్నో అంశాలని సోదాహరణంగా 0 నుంచి 9 వరకు డిజిట్స్ తీసుకుని వివరించారు. ఈరోజు ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేస్తున్న కంప్యూటర్స్ రంగంలో రాణించాలంటే గణిత తర్కం, గణిత ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ కాలేజీ గణిత శాస్త్ర విభాగం కె.జయదేవ్ (ఏఐ), జి.శ్యాంప్రసాద్ రెడ్డి, జి.ప్రసాదరావు, కె.ఎస్.ఐ. ప్రియదర్శిని, కె.సామ్రాజ్యం, కె.సూర్య కుమారి, విద్యార్థులు గణిత గ్రంథాలయాన్ని పరిశీలించారు. తొలుత రామానుజన్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ కేవీవీ సత్యనారాయణను ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేశారు.

విప్లవ వీరులకు ఘన నివాళి


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిద్ధు, అధ్యాపకులు

మండపేట: దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు మహనీయులు అని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు అన్నారు. పట్టణంలోని వైష్ణవి ఒకేషనల్ కాలేజీలో బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ కె.హనుమంతరావు, అధ్యాపకులు రాంబాబు, శ్రీనివాస్, విజయ్‌కుమార్‌లతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్ సింగ్ పోరాట, చైతన్య స్ఫూర్తిని నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండపేట పట్టణ పీడీఎస్‌యూ నాయకులు డి.వినయ్ కుమార్, కె.సంతోష్, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా అగస్త్యేశ్వరుని ఆలయం


సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న దేవాలయం


దేవాలయంలో స్వామి, అమ్మవార్లు

మండపేట: తాపేశ్వరంలో పురాతన చరిత్ర కలిగిన ఉమా అగస్త్యేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధమైంది. గ్రామానికి చెందిన సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు, గ్రామ పెద్దల సహకారంతో ఆయన ఆధునీకరణకు సంకల్పించారు. కొన్ని నెలలుగా జరుగుతున్న ఆలయ ఆధునీకరణ పనులు పూర్తిచేసుకుని శివాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు అయింది. ఈ నేపథ్యంలో ఆలయంలో ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు ప్రత్యేక పూజాదికాలు జరగనున్నాయి. ఆలయ అర్చకులు శంకరమంచి నాగేంద్రప్రసాద్ శర్మ మాట్లాడుతూ శంకరమంచి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ శాంతి కోసం నవగ్రహ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 30న ఉగాది పర్వదినం సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక కుంకుమార్చనలు, అదేరోజున పుల్లకవి భాస్కరరావుతో పంచాంగ శ్రవణ నిర్వహించన్నట్టు తెలిపారు.

ముగిసిన కొత్తపూల ఉత్సవాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో గత పక్షం రోజుల నుంచి నిర్వహిస్తున్న కొత్తపూలు ఉత్సవాలు ముగిశాయి. కొత్తపూల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి రాజానగరం నుంచి వచ్చిన మహిళ గరగ కళాకారులు ప్రదర్శించిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే విచిత్ర వేషధారణలు, శక్తివేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు అదనపు ఆకర్షణగా నిలిచాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ కొత్తపూల ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు. మోదుగుపూలతో అలంకరించిన పెద్ద గరగకు అగరబత్తీలు, మల్లెపూల దండలు సమర్పించి తమభక్తిని చాటుకున్నారు. ఈనెల 27న సూర్యారావుపేటలో చిన జాగరణ నిర్వహించనుండగా చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో 28న పెద జాగరణ జరగనుంది. ఇప్పటికే విద్యుత్తులంకరణ ఏర్పాట్లు పూర్తయ్యాయి.

వేంకటేశ్వరునికి తామర పూలతో పూజ

రావులపాలెం: స్థానిక మార్కెట్ రోడ్డులో వేంచేసిన చిన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి సహస్ర తామర పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


సహస్ర తామరపూలతో అలంకరించిన వేంకటేశ్వర స్వామి

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

ఆలమూరు: స్థానిక నాగుల చెరువుగట్టుమీద కొలువైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఈ కల్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై కనులారా వీక్షించారు.

పది లీటర్ల సారా స్వాధీనం

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం 1800 లీటర్ల బెల్లపుఊటను కనుగొని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక సమీప గోదావరి లంకలో దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే మూల ద్రవం 1800 లీటర్ల బెల్లపుఊట నిల్వ ఉంచిన ప్లాస్టిక్ పీపాలను గుర్తించారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం


మండపేటలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మహిళలు

మండపేట: తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం విరమించేది లేదని 28, 29 వార్డుల మహిళలు తెలిపారు. స్థానిక సత్యశ్రీ రోడ్డులోని సప్తగిరి సినిమా థియేటర్ ఎదురుగా మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం కూడా కొనసాగాయి. ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దంటూ మండుటెండలో దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇటీవల ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు మొరపెట్టుకున్నామని మహిళలు చెప్పారు. వార్డు ప్రజలకు ఇబ్బంది కలిగితే మద్యం షాపు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు బుధవారం తెలిపారు. చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశానికి పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారుల తప్పని సరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

దర్శన టిక్కెట్ పెంపుపై నిరసన

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర తీర్థ ఈనెల 28న ప్రారంభం కానున్నాయి. అయితే ఆలయ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా అమ్మవారి దర్శనం టిక్కెట్‌ను రూ.100 వరకూ పెంచింది. గత కొన్నేళ్ల నుంచి ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.50 వరకూ దర్శనం టిక్కెట్లు మాత్రమే ఉండేవి. ఈ ఏడాది మాత్రం టిక్కెట్ ధరను రెట్టింపు ధరకు పెంచడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోస్తా జిల్లాల నలుమూలల నుంచి వచ్చే సామాన్య భక్తులకు దర్శనం టిక్కెట్ ధర పెంపు అశనిపాతంలా మారింది. దీనిపై ఈవోను వివరణ కోరగా డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకే పెంచినట్టు తెలిపారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ


రాయవరంలో పదో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా పరిశీలకులు రామలింగం

రాయవరం: మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను పరీక్షల జిల్లా పరిశీలకులు మువ్వా రామలింగం బుధవారం తనిఖీ చేశారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎ, బి పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 110 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల సీఎస్‌లు వెంకటేశ్వరరావు, సత్తిరాజులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి

కాజులూరు: పచ్చిరొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని డెల్టాలోని పంట భూముల్లో రైతులు రబీ సాగు అనంతరం మూడో పంటగా పచ్చి రొట్ట ఎరువుల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు. బుధవారం కాజులూరులో ఆయన రైతులతో మాట్లాడుతూ డెల్టాలో కొందరు రైతులు దాళ్వా సాగు అనంతరం అపరాల సాగు చేపట్టగా కొందరు రైతులు దాళ్వా మాసూళ్ల ఆలస్యం కావటంతో పొలాలను కాలిగానే వదిలివేస్తున్నారన్నారు. అయితే పెసర, మినుము వంటి అపరాల సాగుకు అవకాశం లేని పొలాల్లో రైతులు జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువుల సాగు చేపడితే భూసారం పెరుగుతుందన్నారు. పచ్చి రొట్ట ఎరువుల సాగు వలన రైజోబ్యూమ్ అనే బ్యాక్టీరియా వృద్ధి చెంది భూసారం పెరుగుతుందని పచ్చిరొట్ట మొక్క వేళ్ల నుంచి నత్రజని భూమిలో చేరుతుందన్నారు. పచ్చి రొట్ట ఎరువుల సాగు ద్వారా పోషకాలతో కూడిన ఎరువును పొలానికి అందించి తదుపరి వరి సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

తోటపేట సర్పంచ్‌గా మంగాజీ


సర్పంచ్‌గా ఎంపికైన మంగాజీ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట గ్రామ తాత్కాలిక సర్పంచ్‌గా చొప్పెల మంగాజీ ఎంపికయ్యారు. సర్పంచ్ కోరపు కామరాజు మృతి చెందగా జిల్లా అధికారుల నిర్ణయం మేరకు అదే సామాజిక వర్గానికి చెందిన వారిని తాత్కాలిక సర్పంచిగా నియమించాలని నిర్ణయం తీసుకోవడంతో బుధవారం గ్రామ పంచాయతీలో ఎన్నిక నిర్వహించారు. 11 మంది వార్డు సభ్యులు ఉండగా ఎనిమిది మంది పాల్గొని ఆమెను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గామిశెట్టి గంగాపురుషోత్తం తదితరులు సర్పంచ్ మంగాజీని, వార్డు సభ్యులను అభినందించారు

గ్రామాల్లో ఆక్వా జోనేషన్ సభలు


వెంటూరు సభలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకట్రావు

రాయవరం: మండలంలోని కూర్మాపురం, మాచవరం, వెంటూరు గ్రామాల్లో బుధవారం ఆక్వా జోనేషన్ సభలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన ఈ సభల్లో భాగంగా వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తించి, వాటిని ఆక్వా చెరువులుగా మార్చుకునే అవకాశంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వి.రమణారావు, డ్రైనేజీ ఏఈ సాయిచంద్రిక, ఆర్ఐ ధర్మేంద్ర తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెంటూరు, మాచవరం సర్పంచ్‌లు వాసంశెట్టి వెంకట్రావు, కత్తుల సీతామహాలక్ష్మి, కూర్మాపురం ఉప సర్పంచ్ ఈతకోట లక్ష్మణరావు, మాజీ సర్పంచ్‌లు వాసంశెట్టి రాధాకృష్ణ, రిమ్మలపూడి వేణుగోపాలదొర, రైతులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సీఐడీ విచారణ జరిపించాలి

మండపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి తమను దిగ్భ్రాంతికి గురి చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత, క్రైస్తవ లీగల్ సెల్ అడ్వైజర్ దూలి జయరాజు, క్రిస్టియన్ ఎటిడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇజ్రాయేల్ రాజు అన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, దీనిపై సీఐడీ విచారణ జరిపించాలి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో వారు కోరారు. పట్టణంలో నెల రోజుల క్రితం పాస్టర్ ప్రవీణ్ తనకు మతోన్మాదులతో ప్రాణ హాని ఉందని సోషల్ మీడియాలో మాట్లాడారని జయరాజు తెలిపారు. ప్రభుత్వం రక్షణ కల్పించకపోవడం వల్లే ప్రవీణ్ మృతి చెందారని ఆరోపించారు. ఈ కేసును సీఐడీకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.